లక్షెట్టిపేట : ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

భీమారం : ఉపాధ్యాయులతో 2013-14 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనాలు

లక్షెట్టిపేట, మే 26 : లక్షెట్టిపేట జేబీఎస్ పాఠశాల 1987-93 విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. ఈ పూర్వ సమ్మేళనంలో నాటి మిత్రులంతా ఆప్యాయంగా పలకరించుకున్నారు. బాగోగులను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆటాపాటలతో సందడి చేశారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో గురువులు దేవేందర్‌రెడ్డి, రాజమల్లయ్య, నాగమల్లేశ్వరావు, సుదోష్పల్న, సువర్ణ, కుబ్జాదేవి, ఉమాదేవి, హేమాదేవి, సునందలతో పాటు సుమారు 100 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సందడే సందడి..

భీమారం, మే 26 : మండల కేంద్రంలోని జడ్పీ సెంకడరీ పాఠశాలలో 2013-2014 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అప్పటి హెచ్ఎం కామ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొనగా, విద్యార్థులు ఆటాపాటలతో సందడి చేశారు. అనంతరం విందులో పాల్గొన్నారు.

49 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై..

చెన్నూర్ టౌన్, మే 26 : చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1975లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 49 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు పులి రామన్న, అలీ, అడ్వాల లచ్చన్న, బాణాల రామయ్యను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

గురువులకు సన్మానం..

మంచిర్యాల ఏసీసీ, మే 26 : మేదరివాడలోని అభినవ విద్యాసదన్ పాఠశాలలో 2002-03లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని స్వాగత్ గ్రైడ్ హోటల్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. బాగోగులు తెలుసుకొని ఆనందంగా గడిపారు. గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు అశోక్, వేణుగోపాల్, నవరతన్, కేవీ లక్ష్మి పాల్గొన్నారు.

చెన్నూర్ టౌన్ : 1975 బ్యాచ్ విద్యార్థులు


మంచిర్యాల ఏసీసీ : అభినవ విద్యాసదన్ పాఠశాల 2002-03 బ్యాచ్ విద్యార్థులు

హెచ్ఆర్సీఐ సౌత్ ఇండియా
అదనపు ప్రధాన కార్యదర్శిగా రఘుపతిరావు

శ్రీరాంపూర్, మే 26 : హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా(హెచ్ఆర్సీఐ) సౌత్ ఇండియా అదనపు ప్రధాన కార్యదర్శిగా మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన బీర్‌పూర్ రఘుపతిరావును జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నందం నర్సింహారావు నియమించారు. విశాఖపట్నంలో శనివారం జరిగిన హెచ్ఆర్సీఐ ద్వితీయ మహా సభల్లో రఘుపతిరావును సన్మానించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు, ప్రధాన కార్యదర్శి పుల్లంరాజు, జిల్లా ఉపాధ్యక్షులు అరవరాజు శ్రీనివాసరాజు, కండె ఓంనమోశివాయ, కార్యదర్శి రంగు శ్యాంసుందర్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. రఘుపతిరావు మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో సౌత్ ఇండియా అదనపు ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రఘుపతిరావు ఎన్నికపై జిల్లా అధికార ప్రతినిధి భాస్కరి రాజేశం హర్షం వ్యక్తం చేశారు.

రఘుపతిరావును సన్మానిస్తున్న జాతీయ అధ్యక్షుడు శ్రీకాంత్

చేపల వేటకు వెళ్లి.. మడుగులో మునిగి

- ఒడిశా యువకుడి మృతి

హాజీపూర్, మే 26 : ఒడిశా రాష్ట్రానికి చెందిన మగశిర సబర్(31) మంచిర్యాల జిల్లా ముల్కల్ల శివారులోని ఓ మడుగులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందాడని హాజీపూర్ ఎస్ఐ సురేశ్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మగశిర సబర్ మూడు నెలల క్రితం ముల్కల్ల గ్రామ శివారులోని ఇటుక బట్టీలో పనిచేసేందుకు వచ్చాడు. 25వ తేదీన మధ్యాహ్నం శివారులోని ఓ మడుగులో చేపలు పట్టేందుకు వల వేసి వచ్చాడు. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో చేపలను తెచ్చేందుకు బయల్దేరాడు. మడుగులో దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మునిగి ఇరుక్కుపోయాడు. అక్కడికక్కడే మృతిచెందాడు. సబర్ సోదరుడు చక్రధర్ సబర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి తవ్వకాల అడ్డగింత

దండేపల్లి, మే 26 : దండేపల్లి మండలం అల్లీపూర్ గ్రామ చెరువులో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న మట్టి తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. మండలానికి చెందిన ఓ వ్యక్తి చెరువు మట్టిని తీసేందుకు వెయ్యి మెట్రిక్ టన్నులకు ప్రభుత్వం నుంచి సంబంధిత శాఖల ద్వారా అనుమతులు తీసుకున్నాడు. 20 నుంచి తవ్వకాలు చేపట్టారు. వెయ్యి మెట్రిక్ టన్నుల తవ్వకాలు పూర్తయ్యాయని, నిలిపివేయాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా నిబంధనలకు విరుద్ధంగా సదరు వ్యక్తి తవ్వకాలు చేపట్టాడు. అనుమతులు పూర్తయిన తర్వాత ఎందుకు తవ్వకాలు చేపడుతున్నారంటూ గ్రామస్తులు అడ్డుకున్నారు. వెంటనే అధికారులకు సమాచారం అందించారు. అనంతరం తహసిల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

హాజీపూర్, మే 26 : హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముల్కల్ల గ్రామానికి చెందిన చీపిరిశెట్టి గణేశ్(23) విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు. ముల్కల్ల గ్రామానికి చెందిన గణేశ్ శనివారం రాత్రి తన టాటా ఏస్ ట్రాలీని కరెంట్ కట్టర్ మిషన్‌తో కట్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు షాక్ తగిలింది. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ మేరకు గణేశ్ తల్లి చీపిరిశెట్టి కొమురమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గణేశ్ (ఫైల్)

చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, మే 26 : నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని ఆపాలని, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వసాకే సాయి, సభ్యులు నితీశ్, అయూబ్, తిరుపతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

అటు వర్షం..
ఇటు తూకం
నిండా మునుగుతున్న రైతాంగం

- అధికార పార్టీ అండతో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల చేతివాటం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఒక్క సెంటర్‌పై కూడా చర్యలు శూన్యం
- కేంద్రాల్లోనే కుప్పలుగా ఉన్న సగానికి సగం ధాన్యం
- కొనుగోలు చేయాలని వేడుకుంటున్న అన్నదాతలు

రాష్ట్రంలో రైతులు మళ్లీ గోసపడుతున్నరు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో ఓ వైపు అకాల వర్షాలతో ఆగమవుతుంటే.., మరో వైపు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తూకాల్లో మోసం చేస్తున్నారు. అటు కాలం.. ఇటు తూకం మోసంతో నిండా మునుగుతున్నరు. చెన్నూర్ మండలంలోని పొన్నారం, సోమన్‌పల్లి, దుగ్నెపల్లి కేంద్రాల నిర్వాహకుల ఆగడాలను రైతులు ఆధారాలతో సహా అధికారులకు వివరించినా నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. పైగా నిర్వాహకులకే వత్తాసు పలుకుతున్నారని మండిపడుతున్నారు. దుగ్నెపల్లి కేంద్రంలో ఏకంగా కాంటానే తనకు అనుకూలంగా మార్చుకొని ఓ నిర్వాహకుడు మోసానికి తెబడ్డా అటువైపు కన్నెత్తి చూసేవారే లేరని వాపోతున్నారు. ఇలా.. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇవరికి ఇష్టం వచ్చినట్లు వారు దోచుకుంటున్నారని, ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు.

తూకం వేయకపోవడంతో కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం

చెన్నూర్ రూరల్, మే 26 : చెన్నూర్ మండలంలో 44 (పీఏసీఎస్ 25, డీసీఎంఎస్ 9, ఐకేపీ 10) కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, సోమన్‌పల్లి, పొన్నారం, దుగ్నెపల్లి, అంగ్రాజ్‌పల్లి, కొమ్మెర, పొక్కూర్, నాగాపూర్, ఆస్నాద్, కిష్టంపేటతో పాటు పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో అవినీతికి పాల్పడుతున్న నిర్వాహకులపై ఎన్నో ఆరోపణలు వస్తున్నా అధికారులు ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. వాతావరణంలో మార్పు వచ్చి వర్షాలు కురుస్తున్నాయి. ప్రతి రోజూ మబ్బు పట్టి ఉంటున్నది. కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యం అలాగే ఉంటున్నది. లారీలు సరిగా రాకపోవడంతో కొనుగోళ్లు ఆలస్యంగా సాగుతున్నాయి. కాంగ్రెస్ నాయకులకు అనుకులంగా ఉన్న రైతుల ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇక సామాన్య రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. కోతలు ప్రారంభమై దాదాపు రెండు నెలలు గడుస్తున్నా సగానికి సగం రైతుల వడ్లు కొనుగోలు కేంద్రాల్లోనే ఉన్నాయి.

నిర్వాహకుల చేతివాటం..

ప్రతీ కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని కొనుగోలు కేంద్రాలన్నీ కాంగ్రెస్ నాయకులవే. వారి వారి బంధువులవి కావడంతో కేంద్రాల నిర్వాహకుల ఆగడాలకు హద్దుల్లేకుండా పోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొనుగోలు కేంద్రాల్లో వారికి అనుకూలంగా లేని వాళ్లను తొలగించి, వారి స్థానాల్లో పార్టీ వారిని నియమించారు. ప్రతీ గ్రామంలో అనుకూలంగా ఉన్నవారి ధాన్యమే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సామాన్య రైతుల ధాన్యం వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు. ఒక్క ధాన్యం బస్తాను 41 కిలోలకు తూకం వేయాలి. కిలో సంచి బరవు తీసి, 40 కిలోల ధాన్యం బరువు అని ట్రక్ సీట్లలో రాయాలి. కానీ, ప్రతీ కేంద్రంలో 42 నుంచి 44 కిలోల వరకు బస్తా తూకం వేసి, ట్రక్ సీట్‌లో 40 రాస్తున్నారని రైతులు అంటున్నారు. తూకంలోనూ మోసాలకు పాల్పడుతున్నారని మండిపడుతున్నారు. ప్రతి రోజా వాతావరణంలో వస్తున్న మార్పులతో ఇక రైతులు బాధ భరించలేక, చేసేది లేక.. ఏంటీ కష్టాలు అని.. 'ఎంత కటింగ్ అయినా చేయండి. కానీ, మా ధాన్యం కొనండి..' అంటూ కేంద్రాల నిర్వాహకులను వేడుకుంటున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు..

మండలంలోని పొన్నారం, సోమన్‌పల్లి, దుగ్నెపల్లిలోని కేంద్రాల నిర్వాహకుల ఆగడాలను రైతులు ఆధారాలతో సహా అధికారులకు వివరించారు. ఎలాంటి బిల్లులు, ట్రక్ సీట్లు చూపకుండా కటింగ్‌ల పేర్లతో రైతులను మోసం చేస్తున్నారు. దుగ్నెపల్లిలోని కొనుగోలు కేంద్రంలో ఏకంగా తూకం కాంటానే తనకు అనుకూలంగా మార్చుకొని మోసానికి తెబడ్డాడు. ఇలా అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇవరికి ఇష్టం వచ్చినట్లు వారు రైతులను మోసగిస్తూనే ఉన్నారు. అధికారులు వచ్చి చూసి వెళ్లడం తప్ప ఒక్క రైతుకూ న్యాయం చేసింది లేదని రైతులు విమర్శిస్తున్నారు. కేంద్రం నిర్వాహకులపై చర్యలు కుడా తీసుకోవడం లేదని వాపోతున్నారు. సోమన్‌పల్లిలో అండగా నిలువాల్సిన అధికారులు కేంద్రం నిర్వాహకుడితో కుమ్ముక్కై, నష్టపోయిన రైతును పరిహారం తీసుకో అని ఒక్క అధికారి చెప్పడం ఎంత వరకు సమంజసమని రైతులు ఆరోపిస్తున్నారు. ఇలా అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో కేంద్రాల నిర్వాహకులు రైతులపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

వర్షానికి వడ్లు తడవకుండా కుప్ప చుట్టూ కాలువ తీస్తున్న రైతు

మళ్లీ గోసలు సురువైనయ్..

పంటలు బాగా పండినయ్. కోతకు వచ్చింది. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకచ్చినం. వాతావరణంలో వచ్చిన మార్పు కారణంగా కేంద్రంలో 15 నుంచి 20 రోజుల వరకు ధాన్యం నిలిచిపోయింది. కేంద్రం నిర్వాహకులు కూడా వాళ్లకి అనుకులంగా ఉన్న రైతుల ధాన్యమే కాంతా వేస్తున్నరు. సామాన్య రైతులవి వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. నింబంధనలకు విరుద్ధంగా తూకాల్లో మోసం చేస్తున్నారు. రైతులకు మళ్లీ గోసలు సురువైనట్టు అనిపిస్తున్నది.

- ఇంగిలి చంద్రయ్య, రైతు అస్నాద్

అధికారులు మొత్తానికే పట్టించుకుంటలేరు..

సోమన్‌పల్లిలోని పీఏసీఎస్ కేంద్రం నిర్వాహకుడు రైతులను చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నడు. అయినా అధికారులు పట్టించుకుంటలేరు. రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసిన తర్వాత రసీదులు ఇవ్వడం లేదు. మళ్లీ మిల్లుల్లో ధాన్యం మంచిగా లేకపోవడంతో కటింగ్ అవుతున్నాయంటూ రైతులను మోసం చేస్తున్నడు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టింపులేదు. వాళ్లకే వత్తాసు పలుకుతున్నరు. ఇలాంటి వారితో రానున్న రోజుల్లో ఎవుసం చేసుటానికి రైతులు ముందుకు రారు.

- కిరణ్ రెడ్డి, రైతు, సోమన్‌పల్లి

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం

లారీలు రాక.. కాంటా వేయక రైతుల అవస్థలు

వేమనపల్లి, మే 26 : మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలు రాకపోవడంతో కేంద్రాల్లోనే ధాన్యం నిల్వలున్నాయి. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంతో పాటు దస్నాపూర్, గొర్లపల్లి, నీల్వాయి, జిల్లెడ, సూరారం కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకువచ్చి కుప్పలుగా పోశారు. వర్షాలు వస్తే ధాన్యం తడుస్తుందని రోడ్డుపై వడ్ల కుప్పలను పోసి, పడిగాపులు కాస్తున్నారు. అయినా మిల్లర్ల నుంచి కేంద్రాలకు లారీలు రాకపోవడంతో కాంటా చేయడం లేదు. దీంతో ధాన్యం నిల్వ ఉండడంతో వర్షాలు వస్తే ధాన్యం తడిసి నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 90 లారీలకు సరిపడా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉందని తెలిపారు. అధికారులు స్పందించి, ధాన్యం కాంటా వేసేలా చూడాలని కోరుతున్నారు.

వేమనపల్లి మండల కేంద్రానికి వెళ్లే రహదారిపై పోసిన ధాన్యం కుప్పలు

కొనుగోళ్లు త్వరితగతిన పూర్తిచేయాలి

చెన్నూర్, మే 26 : రాష్ట్ర ప్రభుత్వం చెన్నూర్ నియోజకవర్గంలో త్వరితగతిన వరి ధాన్యం కొనుగోళ్లను పూర్తిచేయాలని బీఆర్ఎస్ కౌన్సిలర్ దోమకొండ అనీల్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం ఉండడంతో అకాల వర్షాలకు రైతులు ఇబ్బందులుపడుతున్నారని తెలిపారు. నియోజకవర్గ రైతులు ఇబ్బందులకు గురవుతుంటే, వారి సమస్యలు పరిష్కరించే ఎమ్మెల్యే వివేక్ విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా బాల్క సుమన్ ఉన్నప్పుడు కొనుగోలు కేంద్రాల నుంచి ఎప్పటికప్పుడు ధాన్యం రైస్ మిల్లులకు తరలించేవారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, వెంటనే కొనుగోలు కేంద్రాల్లోని ధ్యానాన్ని తూకం వేసి మిల్లులకు తరలించి, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

కోటపల్లి, మే 26 : కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన సాపాటి నారక్క(55) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నారక్క ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకున్నది. గమనించిన భర్త వెంటనే అప్రమత్తమై ఉరిని తొలగించాడు. కొన ఊపిరితో ఉన్న నారక్క, కొద్దిసేపటికి మృతిచెందినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ కాంతారావ్ తెలిపారు. భర్త బాల్యా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

లక్షెట్టిపేటలో యువకుడు..

లక్షెట్టిపేట, మే 26 : లక్షెట్టిపేట మండలం చందారం గ్రామానికి చెందిన రాథోడ్ రాజేందర్(31) పురుగల మందు తాగి, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రామయ్య ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21న తన భార్య సుజీతతో కలిసి అత్తగారింట్లో పూజ కోసం జన్నారం మండలం మొర్రిగూడకు వెళ్లారు. పూజ అనంతరం డీజే పాటల విషయంలో బావమరిది దేవేందర్, ఆయన భార్య రజితతో గొడవ జరిగింది. ఇద్దరూ రాజేందర్‌ను ఇష్టం వచ్చినట్లు తిట్టి, కర్రలతో కొట్టారు. అక్కడి నుంచి చందారం వచ్చిన రాజేందర్, మనస్తాపం చెంది 25వ తేదీన పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాల దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి నాందేవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన పూజా మహోత్సవాలు

తిర్యాణి, మే 26 : తిర్యాణి మండలంలోని నాయకపుగూడలో పదిరోజులుగా ఆదివాసీ సేవా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చిన్నయ్య, పెద్దయ్య దేవుళ్ల పూజా మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. నాయక్‌పోడ్ సంస్కృతీసంప్రదాయం ప్రకారం దేవతామూర్తులతో ఊరేగింపుగా ఆదివాసీ నాయకపోడ్ గిరిజనులు నివసించే గ్రామాలను సందర్శించి, ఇంటింటా ప్రత్యేక పూజలు చేశారు. దండేపల్లి సమీపంలోని గోదావరి వద్ద ప్రత్యేక పూజలు చేసి, దేవతామూర్తులకు స్నానం చేయించారు. అనంతరం నాయకపుగూడలోని చిన్నయ్య, పెద్దయ్య ఆలయంలో శనివారం ప్రతిష్ఠించారు.

రైతులకు అవగాహన

బెజ్జూర్, మే 26 : మండలంలోని తలాయి, సుస్మీర్ గ్రామాల్లో ఆదివారం ఏఈవో శ్రీధర్ రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలను లైసెన్సుగల దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని సూచించారు. ప్యాకెట్‌పై లాట్ నంబర్, చెల్లుబాటు కాలం తేదీ, కంపెనీ తదితర విషయాలను గమనించి కొనుగోలు చేయాలని తెలిపారు. సుస్మీర్, తలాయి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అండగా ఉంటాం

దండేపల్లి, మే 26 : దండేపల్లి సమీపంలో ఇటీవల జరిగిన ట్రాలీ బోల్తాపడ్డ ఘటనలో గాయపడిన ఉపాధి కూలీల కుటుంబానికి అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో 16 మంది ఉపాధి కూలీల కటుంబాలను పరమార్శించారు. ఒక్కో కుటుంబానికి రఘుపతిరావు ట్రస్ట్ ద్వారా రూ.10 వేల చొప్పున నగదుతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన మహిళా కుటుంబానికి రూ.20 వేలు అందించారు. ప్రభుత్వం నుంచి కూడా సాయం అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగారాణి, ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, మండలాధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు గడ్డం త్రిమూర్తి, వెంగళరావు, స్థానిక నాయకులు ఉన్నారు.

సాయం అందజేస్తున్న కొక్కిరాల సురేఖ

ఆర్టీసీ బస్సు సర్వీసును పొడిగించాలి

తిర్యాణి, మే 26 : మంచిర్యాల నుంచి మండల కేంద్రం వరకు వస్తున్న ఆర్టీసీ బస్సు సర్వీసును చెలిమెల గ్రామం వరకు పొడిగించాలని మండలంలోని ప్రజలు కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభమవనున్న నేపథ్యంలో మండల కేంద్రం వరకే బస్సు వస్తుండడంతో విద్యార్థులు కాలినడకన చెలిమెల కళాశాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. సమయానికి చేరుకోలేకపోతున్నారని తెలిపారు. అలాగే కళాశాల పక్కనే ప్రభుత్వ 30 పడకల దవఖాన ఉందని, దవఖాన వరకు వెళ్లేందుకు కూడా ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో అవస్థలు పడాల్సి వస్తున్నదని వాపోయారు. సంబంధిత అధికారులను స్పందించి, సర్వీసును పెంచాలని కోరుతున్నారు

కారు ఢీకొని ఒకరి మృతి

జన్నారం, మే 26 : జన్నారం మండలం రోటిగూడ గ్రామానికి చెందిన కందుల లచ్చన్న (68) మహ్మదాబాద్ వద్ద ఆదివారం కారు ఢీకొని మృతిచెందాడు. ఎస్ఐ రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం. కందుల లచ్చన్న ఆదివారం మహ్మదాబాద్ గ్రామంలో ఉపాధి హామీ పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రధాన రహదారిపై కుమ్రం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలానికి చెందిన మడావి శ్రీనివాస్ కారుతో ఢీ కొట్టాడు. లచ్చన్నకు తీవ్రగాయాలవడంతో కరీంనగర్‌లోని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. పంచనామా నిర్వహించి, లక్షెట్టిపే ప్రభుత్వ దవాఖానలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. మడావి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీటీ రోడ్ల నిర్మాణానికి పరిశీలన

తాండూర్, మే 26 : మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణం కోసం ఐటీడీఏ సీఈ ముడిమడుగుల శంకర్, డీఈ షఫీ, జేఈ సాయికృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్లను పరిశీలించారు. గ్రామీణ రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు తాండూర్ మండలంలో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం.. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సర్వే చేయించింది. కాగా, ఎస్టిమేట్ తయారు చేసి, ఐటీడీఏ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. పనులు మంజూరై, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయి కత్తెర్ల నుంచి జాతీయ రహదారి వరకు 2 కిలోమీటర్లకు రూ.1.60 కోట్లు, బోయపల్లి జాతీయ రహదారి నుంచి గొందుగూడెం గ్రామం మీదుగా బుగ్గగూడెం లింకు రోడ్డు వరకు 3 కిలోమీటర్లకు రూ.2.40 కోట్లు, అచ్చలాపూర్ నుంచి బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి వరకు 6 కిలోమీటర్లకు రూ.4.80 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం ఆయా గిరిజన గ్రామాలకు జూన్ 6వ తేదీ తర్వాత బీటీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు సీఈ శంకర్ పేర్కొన్నారు. వారి వెంట కాంట్రాక్టర్ వెంకటేశ్వర్‌రావు, స్థానిక ప్రజలు ఉన్నారు.

బోయపల్లి-బుగ్గ రోడ్డును పరిశీలిస్తున్న ఐటీడీఏ సీఈ శంకర్

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

దహెగాం, మే 26 : మండలంలోని లగ్గాం గ్రామానికి చెందిన మోరె బాపునకు చెందిన ఎదుద ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. రోజువారిగానే ఉదయం పొలానికి మేతకు వెళ్లింది. సమీపంలోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో వైర్లకు తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడిక్కడే మృతి చెందింది. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు పంచనామా నిర్వహించారు. కాగా, వానకాలం సమీపిస్తున్న క్రమంలో ఎద్దు చనిపోవడంతో రైతు ఆందోలన చెందుతున్నాడు. ఎద్దు విలువ రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

28 నుంచి సెమిస్టర్ పరీక్షలు

కాగజ్‌నగర్, మే 26 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యునివర్సిటీ డిగ్రీ ఫస్టియర్ సెమిస్టర్-1 పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతాయని కో-ఆర్డినేటర్ దత్తాత్రేయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఏదైన గుర్తింపు కార్డుతో హాజరుకావాలని పేర్కొన్నారు. గుర్తింపుకార్డు లేకపోతే పరీక్షకు అనుమితించబోమని తెలిపారు.

జూన్ 16న వైద్య శిబిరం

మంచిర్యాల ఏసీసీ, మే 26 : మంచిర్యాల రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో జూన్ 16న తలసేమియా, సికిల్‌సెల్, సికిల్ తాల్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తలసేమియా సికిల్ సెల్ ట్రాన్స్‌మిషన్ సెంటర్ ఇన్‌చార్జి కాసర్ల శ్రీనివాస్ తెలిపారు. బాధితులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూన్ 19న ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ సీఎస్ సిటిజన్స్ దవాఖా హిమటాలజిస్ట్ డాక్టర్ రంజిత్ కుమార్‌తో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 30వ తేదీలోగా బ్లడ్ బ్యాంక్ 70362 22259 నంబర్‌కు సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు సంప్రదించి, పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సీసీసీ నస్పూర్, మే 26 : 33 కేవీ లైన్ మరమ్మతులు కారణంగా నస్పూర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నస్పూర్ పట్టణ విద్యుత్ శాఖ ఏఈ రాంమూర్తి తెలిపారు. ఉదయం 8 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్, మే 26 : కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ, భట్టుపల్లి రోడ్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ కమలాకర్ తెలిపారు. లైన్ మెయింటనెన్స్, చెట్ల తొలగింపు కారణంగా ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వేమనపల్లి, మే 26 : చామనపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ ఆదివారం తెలిపారు. మృతుడికి సుమారు 65 ఏండ్లు ఉంటాయని, సంచిలో లుంగీ, బ్లాంకెట్, వాటర్ బాటిల్, లైటర్, చేతికి రాగి కడియం, ఎడమ చేతి వేలికి రాగి ఉంగరం ఉన్నట్లు పేర్కొన్నారు. సుమారు 25 రోజుల క్రితం చనిపోయి ఉంటాడని తెలిపారు. వివరాలు తెలిసిన వారు 87126 56557, 8712 656555 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.